సాక్షి ప్రకాశం

గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



మహిళా పక్షపాతి సీఎం జగనన్న

సీఎం వైఎస్‌ జగన్‌ మహిళా పక్షపాతిగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. - 8లో..



బీసీ భవన్‌కు రూ.50 లక్షలు

ఒంగోలులో అసంపూర్తిగా ఉన్న బీసీ భవన్‌కు రూ.50 లక్షలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కును ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బీసీ నేతలకు అందజేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
32/21

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్‌

రీజినల్‌ కోఆర్డినేటర్‌గా చెవిరెడ్డి



చెవిరెడ్డి భాస్కరరెడ్డి

ఒంగోలు: వైఎస్సార్‌ సీపీ రీజినల్‌ కో ఆర్డినేటర్‌గా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిని నియమించారు. వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగిందని పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఒంగోలు పార్లమెంట్‌తోపాటు కందుకూరు, కావలి, సంతనూతలపాడు నియోజకవర్గాలకు ఈయన కోఆర్డినేటర్‌గా వ్యవహరించనున్నారు. ఇప్పటి వరకు ఈ నియోజకవర్గాల పరిధిలో కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డికి గుంటూరు పార్లమెంట్‌ నియోజకవర్గ బాధ్యతలను అప్పగించారు. చెవిరెడ్డి భాస్కరరెడ్డి ప్రభుత్వ విప్‌, తుడా చైర్మన్‌, టీటీడీ ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా వ్యవహరిస్తున్నారు.

జేసీగా గోపాలకృష్ణ బాధ్యతల స్వీకరణ నేడు

ఒంగోలు అర్బన్‌: జిల్లాకు కొత్తగా జాయింట్‌ కలెక్టర్‌గా నియమితులైన రోణంకి గోపాలకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు పేషీ అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటలకు జాయింట్‌ కలెక్టర్‌ బాధ్యతలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు జాయింట్‌ కలెక్టర్‌గా పనిచేసిన కే శ్రీనివాసులును నంద్యాల జిల్లా కలెక్టర్‌గా నియమించిన సంగతి తెలిసిందే.

పోలీస్‌ అధికారులతో డీజీపీ సమావేశం

బేస్తవారిపేట: పోలీస్‌ అధికారులతో సమావేశాన్ని రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి నిర్వహించారు. బుధవారం నంద్యాల వెళ్తూ మార్గంమధ్యలో బేస్తవారిపేట మండలంలోని చింతలపాలెంలోని వెలిగొండ ప్రాజెక్ట్‌ గెస్ట్‌హౌస్‌లో డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల సమస్య తలెత్తే గ్రామాలు ఏమన్నా ఉన్నాయా, ఎవరు ఎంతకాలం నుంచి విధులు నిర్వహిస్తున్నారనే సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎలక్షన్‌ సక్రమంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ మలికా గర్గ్‌, డీఎస్పీలు, సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

జిల్లాకు ఇద్దరు ఎస్‌డీసీల నియామకం

ఒంగోలు అర్బన్‌: జిల్లాకు ఇద్దరు స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్లు (ఎస్‌డీసీ)లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు తహసీల్దారుగా ఉన్న తలమంచి వెంకట సునీల్‌ను పదోన్నతిపై ఎస్‌డీసీగా గుండ్లకమ్మ రిజర్వాయర్‌ ప్రాజెక్టు ఎస్‌డీసీగా నియమించారు. అదేవిధంగా ఎం వెంకట సత్యనారాయణను సివిల్‌ సప్లయిస్‌ డీఎంగా నియమించారు. జిల్లాలో ఎక్స్‌ప్రెస్‌ హైవే ఎస్‌డీసీగా ఉన్న నరసింహంను బదిలీ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

29 మంది ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు

ఒంగోలు సిటీ: ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఒకే జిల్లాలో 3 సంవత్సరాలు పైన, స్వంత జిల్లాల్లో పనిచేస్తున్న ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు ఎన్నికల నిమిత్తం బదిలీ చేస్తూ పంచాయతీరాజ్‌ కమిషనర్‌ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లా నుంచి వచ్చిన 23 మందికి, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన ఆరుగురు ఎంపీడీవోలకు మండలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి బుధవారం తెలిపారు. పోస్టింగ్‌లు ఇచ్చిన స్థానాలివీ..బి.బాబురావు-కారంచేడు, పి.జె.విలియమ్స్‌-పుల్లలచెరువు, పి.శివసుబ్రహ్మణ్యం-యద్దనపూడి, ఎస్కే.గౌసియాబేగం-పొదిలి, కె.సమతావాణి-కొరిశపాడు, వై.హనుమారెడ్డి-బల్లికురవ, రెవ్‌.ఫణికుమార్‌ నాయక్‌- సంతనూతలపాడు, బి.మహేష్‌బాబు-కనిగిరి, యు.బి.వరప్రసాద్‌-చినగంజాం, పి.పుట్టారెడ్డి-పామూరు, పి.ఎస్‌.పద్మాకర్‌-కొత్తపట్నం, బి.శ్రీనివాసరెడ్డి-కొనకనమిట్ల, కె.నరసింహారావు-కొమరోలు, జి.కాశయ్య-సంతమాగులూరు, కె.మాత్యుబాబు-జె.పంగులూరు, జి.వి.సత్యన్నారాయణ-అద్దంకి, పి.సీతారామయ్య -కురిచేడు, ఎం.శ్రీదేవి-ఇంకొల్లు, టి.సుగుణమ్మ-మద్దిపాడు, వి.విజయలక్ష్మి-రాచర్ల, .ఎం.శోభారాణి-చీరాల, వై.రాజగోపాల్‌-పర్చూరు, వై.మహాలక్ష్మి-నాగులుప్పలపాడు, ఏ.ప్రమీలారాణి-కందుకూరు, టి.నగేష్‌కుమారి- సింగరాయకొండ, పి.నాగమణి-కొండపి, ఏ.వి.సుబ్బారావు-గుడ్లూరు, ఎం.శ్రీహరి-ఉలవపాడు, పి.సుబ్రహ్మణ్యం- టంగుటూరు.

నాణ్యతపైనే ఆశ

రికార్డు స్థాయి ధరలతో గతేడాది పొగాకు రైతులకు కనక వర్షం కురిపించింది. ఈ ఏడాది కూడా అదే ఆశతో రైతులు సాగు చేపట్టారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సారి సాగు విస్తీర్ణం సైతం పెరిగింది. గత సీజన్‌లో 2022–23 సంవత్సరంలో ప్రకాశం రీజియన్‌ పరిధిలో 68 వేల హెక్టార్లలో సాగుచేయగా ఈ దఫా 74 వేల హెక్టార్లలో పొగాకును పండించారు. వర్షాభావ పరిస్థితుల్లో దిగుబడి రాకపోయినా విస్తీర్ణం పెరగడంతో బోర్డు విధించిన పరిమితికి మించి ఉత్పత్తి వస్తుందని అంచనా వేస్తున్నారు. క్యూరింగ్‌లో నాణ్యత ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు.

- రీజియన్‌ పరిధిలో 74 వేల హెక్టార్లలో పొగాకు సాగు
- ఈ దఫా అదనంగా 5 వేల హెక్టార్లలో సాగు
- 11 వేలం కేంద్రాల పరిధిలో 89.9 మిలియన్‌ కేజీల పొగాకు విక్రయాలకు బోర్డు అనుమతి
- దిగుబడి తగ్గినా, విస్తీర్ణం పెరగడంతో ఉత్పత్తి తగ్గదని అధికారుల అంచనా



పొగాకు పంట

ఒంగోలు, సాక్షిప్రతినిధి: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇతర పంటల కంటే పొగాకు సాగు వైపు రైతులు చూశారు. దీని సాగుకు కొంత అనుకూల వాతావరణం ఉండడంతో గత ఏడాది కంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. పొగాకు బోర్డు ప్రకాశం రీజియన్‌ ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో 11 వేలం కేంద్రాలున్నాయి. జిల్లా పరిధిలో 7, నెల్లూరు జిల్లాలో కందుకూరులో రెండు, డీసీపల్లి, కలిగిరి వేలం కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 2022–23 ఏడాది పొగాకు సీజన్‌లో రికార్డు ధరలు వచ్చాయి. కేజీ పొగాకు అత్యధికంగా రూ.290 వరకు ధర పలికింది. దీంతో రైతులకు గత సీజన్‌లో పొగాకు పంట సిరులు కురిపించింది. ఈ నేపథ్యంలో 2023–24 ఏడాదిలో కూడా పొగాకు పంట భారీగా సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. బోర్డు అధికారుల అంచనాకు అనుగుణంగా 74 వేల హెక్టార్లలో ఏడాది పొగాకు పంట సాగైంది. గత ఏడాదిలో 69 వేల హెక్టార్లు సాగు చేశారు. గతేడాదితో పోల్చితే దాదాపు 5 వేల హెక్టార్లలో పంట అధికంగా సాగైంది.

పెరిగిన పెట్టుబడులు:

పొగాకు సాగులో ఏడాదికేడాదికీ సాగు ఖర్చులు పెరుగుతున్నా అదే సందర్భంలో మార్కెట్‌ ఆశాజనకంగా ఉండడంతో రైతులు దీనివైపే మొగ్గు చూపుతున్నారు. అయితే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితి నెలకొనడంతో సాగు ఖర్చు మరింత పెరిగింది. ఒక ఎకరా పొగాకు సాగు చేసి ఉత్పత్తి చేతికొచ్చే సరికి రూ.1.30 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు చెప్తున్నారు. ప్రధానంగా కూలీల రేట్లు పెరగడం, నీటి తడుల కోసం వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తుండడంతో సాగు ఖర్చు విపరీతంగా పెరుగుతుందంటున్నారు. వర్షాభావ పరిస్థితులతో ఈ సారి ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చే అవకాశం ఉందని, అదే గతేడాది 8 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించినట్లు చెప్తున్నారు.

బ్రైట్‌ గ్రేడ్‌తోనే లాభాలు

క్యూరింగ్‌లో వచ్చే పొగాకు నాణ్యత, రంగే రైతులకు ఇక్కడ ప్రధానం. నాణ్యత బాగుంటేనే వేలంలో రేట్లు అధికంగా ఉంటాయి. అయితే ఈ ఏడాది క్యూరింగ్‌లో పొగాకు నాణ్యత మెరుగ్గా ఉండడం రైతులకు ఊరటనిచ్చే అంశం. క్యూరింగ్‌లో దాదాపు 70 శాతం పొగాకు బ్రైట్‌ గ్రేడ్‌ దిగుబడి వస్తుండగా, 20 శాతం వరకు లోగ్రేడ్‌, మిగిలినవి ఇతర గ్రేడ్‌లు వస్తున్నాయని బోర్డు అధికారులు చెబుతున్నారు. బ్రైట్‌ గ్రేడ్‌ ఉంటేనే రైతులకు అధిక లాభాలు వస్తాయి. 2023–24 పంట సీజన్‌కు సంబంధించి 89.9 మిలియన్‌ కేజీల పొగాకును అమ్ముకునేందుకు బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే గత సీజన్‌లో బోర్డు అనుమతిని మించి దాదాపు 123.10 మిలియన్‌ కేజీల వరకు పొగాకు అమ్మకాలు సాగాయి. ఈ ఏడాది అదే స్థాయిలో ఉత్పత్తి వస్తుందని బోర్డు అధికారుల అంచనా. దిగుబడులు కాస్త తగ్గినా అదే సమయంలో సాగు విస్తీర్ణం పెరగడం వల్ల ఉత్పత్తి తగ్గదని అంచనా వేస్తున్నారు. అలాగే ఈ ఏడాది కర్ణాటక పొగాకు మార్కెట్‌లో కేజీ పొగాకు సరాసరి ధర రూ.250 వరకు పలకడం కూడా ధరలపై ఆశలు రేకెత్తిస్తోంది. గతేడాది మాదిరే ఈ ఏడాది కూడా రేట్లు ఉంటాయని రైతులు ఆశలు పెట్టుకున్నారు.

> **సాగు విస్తీర్ణం పెరిగింది**
> పొగాకు బోర్డు ప్రకాశం రీజియన్‌ పరిధిలో ఈ ఏడాది పొగాకు సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం సాగు చేయడం దాదాపు ముగిసింది. ఇప్పటి వరకు 11 వేలం కేంద్రాల పరిధిలో 74 వేల హెక్టార్లలో పంటను రైతులు సాగు చేశారు. గతేడాది కంటే 5 వేల హెక్టార్లలో అధికంగా పొగాకు సాగైంది. క్యూరింగ్‌లో పొగాకు నాణ్యత బాగుంది. బ్రైట్‌ గ్రేడ్‌ దిగుబడులు అధికంగా రావడం రైతులకు మేలు చేస్తుంది.
> – లక్ష్మణరావు, ఆర్‌ఎం పొగాకు బోర్డు

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు

- పారదర్శకంగా వైద్య ఉద్యోగాల నియామకాలు
- ఎవరికీ అన్యాయం జరగకుండా ఎంపిక ప్రక్రియ
- ఒంగోలు ప్రభుత్వ మెడికల్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డా.ఏడుకొండలు



విలేకరులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్‌ డా.ఏడుకొండలు

ఒంగోలు టౌన్‌: వైద్యశాఖలో ఉద్యోగాల ప్రక్రియకు సంబంధించి మధ్య దళారుల మాటలను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ డా.ఎ.ఏడుకొండలు తెలిపారు. బుధవారం మెడికల్‌ కళాశాలలోని ప్రిన్సిపాల్‌ ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు సంబంధించి విధి విధానాలను వెల్లడించారు. ప్రభుత్వం మొత్తం 44 కేటగిరీల్లో 298 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ విడుదల చేసిందని, ఇందుకుగాను 12591 మంది దరఖాస్తు చేసుకున్నట్టు వివరించారు. ఇందులో మార్కాపురం వైద్య కళాశాల, మార్కాపురం సర్వజన ఆస్పత్రి, నర్సింగ్‌ కళాశాలలకు సంబంధించి 255 ఉద్యోగాలుండగా మిగతా ఒంగోలు జీజీహెచ్‌, వైద్యకళాశాల, నర్సింగ్‌ కళాశాలలకు కేటాయించినట్లు చెప్పారు. కలెక్టర్‌ ఆదేశాల మేరకు పూర్తి స్థాయి సిబ్బందితో వివిధ దశల్లో స్క్రూటినీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్క్రూటినీ పూర్తయిన తరువాత ప్రావిజనల్‌ లిస్ట్‌ తయారు చేసిన అనంతరం ఈ జాబితాను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పెడతారని తెలిపారు. అభ్యర్థులు జాబితాను పరిశీలించి ఏవైనా అభ్యంతరాలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత మాత్రమే తుది జాబితాను విడుదల చేస్తారన్నారు. అయితే ఇటీవల కొందరు మధ్య దళారులు వైద్యశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెబుతూ నిరుద్యోగులను ప్రలోభాలకు గురిచేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఎవరి మాటలను నమ్మవద్దని స్పష్టం చేశారు. తొందరపడి ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దన్నారు.

సెలక్షన్‌ విధానం ఇలా...

వంద శాతం మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుందని ప్రిన్సిపాల్‌ డా.ఏడుకొండలు వివరించారు. అభ్యర్థి విద్యార్హతలను పరిగణలోకి తీసుకొని 75 శాతం మార్కులు లెక్కేస్తారని, చదువు పూర్తయిన తరువాత నుంచి ఏడాదికి ఒక మార్కు చొప్పున వెయిటేజి ఇస్తారని తెలిపారు. సర్వీస్‌ వెయిటేజి 15 శాతం మార్కులు ఉంటాయని, అందులో కోవిడ్‌ సమయంలో ప్రభుత్వ రంగంలో చేసిన సేవలకు గాను 6 నెలలకు గాను 5 శాతం మార్కులు, గిరిజన ప్రాంతంలో వైద్య సేవలను అందించిన వారికి 2.5 మార్కులు, మిగతా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సేవలు చేసిన అభ్యర్థులకు కేటాయించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏడీ విజయలక్ష్మి, ఏఓ ప్రకాశరావు, సూపరింటెండెంట్‌ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురై మోసపోవద్దు: డీఎంహెచ్‌ఓ డా.రాజ్యలక్ష్మి

జిల్లా వైద్యారోగ్య శాఖలో అర్హత కలిగిన కాంట్రాక్ట్‌ ఉద్యోగులను రెగ్యులర్‌ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఉన్నతాధికారుల నుంచి సమాచారం వచ్చినట్లు డీఎంహెచ్‌ఓ డా.రాజ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో ఎవరైనా మీ ఉద్యోగాలను రెగ్యులర్‌ చేయిస్తామంటూ చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దన్నారు. అర్హతలను బట్టి రెగ్యులర్‌ చేస్తారని, ఎవరి ప్రలోభాలకు గురికావద్దన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో సమాచారం అందించాలని కోరారు.

కొండపి నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వండి

- సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని కోరిన మంత్రి ఆదిమూలపు సురేష్‌
- రూ.82.90 కోట్ల ప్రతిపాదనలను సీఎంకు అందజేసిన మంత్రి ఆదిమూలపు సురేష్‌



సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్‌

టంగుటూరు:

కొండపి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్‌ ఆదిమూలపు సురేష్‌ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డిని కోరారు. బుధవారం సచివాలయంలో రాష్ట్ర క్యాబినెట్‌ సమావేశంలో పాల్గొన్న ఆయన కొండపి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సీఎంకు అందజేశారు. ప్రజల వినతి మేరకు ప్రాధాన్యత ఉన్న ఐదు పనులకు సంబంధించి రూ.82.90 కోట్ల నిధులు కావాలని కోరారు. టంగుటూరు మండలం అనంతవరం నుంచి తేటుపురం రోడ్డు కం బ్రిడ్జి కోసం రూ.2.4 కోట్లు, సింగరాయకొండ పట్టణంలోని జాతీయ రహదారి 5 రోడ్డు విస్తరణ అభివృద్ధి కోసం రూ.4 కోట్లు, వయా కొండపి ఒంగోలు నంద్యాల రోడ్డు పనులకు రూ.50 కోట్లు, కొండపి మండలం కె.ఉప్పలపాడు-ఎం.నుడమానూరు కనెక్టివిటీ రోడ్డు కోసం రూ.1.50 లక్షలు, మర్రిపూడి మండలం చిలంకూరు వద్ద రోడ్డు కం చెక్‌ డ్యాం నిర్మాణం కోసం రూ.25 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఈ పనులకు అవసరమైన నిధులు మంజూరు కోసం సీఎం సానుకూలంగా స్పందించినట్లు మంత్రి ఆదిమూలపు సురేష్‌ తెలిపారు.

జిల్లాలో భారీగా తహశీల్దార్ల బదిలీ

ఒంగోలు అర్బన్‌:

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో భారీగా తహశీల్దార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మన జిల్లా నుంచి ఉమ్మడి గుంటూరు, నెల్లూరు జిల్లాలకు తహశీల్దార్లను బదిలీ చేశారు. అదేవిధంగా జోన్‌-3లోని నెల్లూరు, గుంటూరు జిల్లాల నుంచి తహశీల్దార్లను ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు.

ప్రకాశం జిల్లాకు బదిలీ అయిన తహశీల్దార్లు: గుంటూరు జిల్లా నుంచి శ్రీకాంత్‌ కేదార్‌నాథ్‌, జీ సిద్దార్థ, డీ పద్మనాభుడు, జే ప్రసాదరావు, ఎం నాగిరెడ్డి, కేఎస్‌ చక్రవర్తి, ఎం డేనియేల్‌, జీ రమేష్‌కుమార్‌, షేక్‌ మహ్మద్‌హుస్సేన్‌, ఎస్‌ సురేష్‌, ఎండీ జియాహక్‌, ఎం భవానిశంకర్‌, జీ సుజాత, జే మధుబాబు, బీ కిరణ్‌కుమార్‌, ఏవీ సుధాకర్‌, టీ మస్తాన్‌, ఆర్‌ యశోద, కే సుజాత, డీ మల్లికార్జునరావు ఉన్నారు. అయితే ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన తహశీల్దార్లను కలెక్టర్‌ మండలాలకు నియమించనున్నారు.

మన జిల్లా నుంచి గుంటూరు, నెల్లూరు జిల్లాలకు బదిలీ అయిన తహశీల్దార్లు

ప్రకాశం జిల్లా తహశీల్దారు పేరు	కేటాయించిన ఉమ్మడి జిల్లా	కేటాయించిన కొత్త జిల్లా
టీ రవి, సూపరింటెండెంట్‌	గుంటూరు	పల్నాడు
ఎస్‌ఎల్‌ నారాయణరెడ్డి, ల్యాండ్‌-1 సూపరింటెండెంట్‌	గుంటూరు	బాపట్ల
ఎస్‌ వెంకటేశ్వర్లు, ల్యాండ్‌-2 సూపరింటెండెంట్‌	గుంటూరు	పల్నాడు
కేఎస్‌ఆర్‌ కృష్ణారావు, డీఏఈ, ఆర్డీవో ఒంగోలు	గుంటూరు	పల్నాడు
బీ జయవర్ధన్‌, డీఏఓ, ఆర్డీవో కనిగిరి	గుంటూరు	పల్నాడు
పీ మధుసూదనరావు, తహశీల్దారు, చీమకుర్తి	గుంటూరు	గుంటూరు
ఎస్‌ ఉషారాణి, తహశీల్దార్‌ జరగుమల్లి	గుంటూరు	పల్నాడు
పీ సింగారావు, తహశీల్దారు, కొండపి	గుంటూరు	పల్నాడు
బీవీ రమణారావు, తహశీల్దారు, కొండపి	గుంటూరు	పల్నాడు
ఎండీ నయూమ్‌ అహ్మద్‌, తహశీల్దారు, ముండ్లమూరు	గుంటూరు	పల్నాడు
జీ రజనీకుమారి, తహశీల్దారు, మద్దిపాడు	గుంటూరు	పల్నాడు
సీహెచ్‌ ఉష, తహశీల్దారు, సింగరాయకొండ	గుంటూరు	పల్నాడు
కే సంజీవరావు, తహశీల్దారు, టంగుటూరు	నెల్లూరు	నెల్లూరు
కే వెంకటేశ్వరరావు, తహశీల్దారు, దర్శి	గుంటూరు	గుంటూరు
ఎం సువర్ణ, తహశీల్దారు, దొనకొండ	గుంటూరు	పల్నాడు
వీ పుల్లారావు, తహశీల్దారు, హెచ్‌ఎం పాడు	గుంటూరు	బాపట్ల
ఎల్‌ లక్ష్మీనారాయణ, తహశీల్దారు, కనిగిరి	గుంటూరు	పల్నాడు
ఎం జ్వాలా నరసింహం, తహశీల్దారు, కురిచేడు	గుంటూరు	పల్నాడు
ఎం హరిబాబు, తహశీల్దారు, మర్రిపూడి	గుంటూరు	పల్నాడు
కే ప్రవీణ్‌కుమార్‌, తహశీల్దారు, పీసీపల్లి	గుంటూరు	పల్నాడు
సీహెచ్‌ అశోక్‌కుమార్‌ రెడ్డి, తహశీల్దారు, పొదిలి	గుంటూరు	పల్నాడు
ఎం శ్రావణ్‌కుమార్‌, తహశీల్దారు పొన్నలూరు	గుంటూరు	బాపట్ల
ఎస్‌ వాసు, తహశీల్దారు, వెలిగండ్ల	నెల్లూరు	నెల్లూరు
డీవీబీ వరకుమార్‌, తహశీల్దారు, బేస్తవారిపేట	గుంటూరు	పల్నాడు
పీ శైలేంద్రకుమార్‌, తహశీల్దారు, కంభం	నెల్లూరు	నెల్లూరు
డీ మంజునాథరెడ్డి, తహశీల్దారు, మార్కాపురం	గుంటూరు	పల్నాడు
ఎంవీ కృష్ణారెడ్డి, తహశీల్దారు, పెద్దారవీడు	నెల్లూరు	నెల్లూరు
వీ కిరణ్‌, తహశీల్దారు, త్రిపురాంతకం	గుంటూరు	బాపట్ల
కే రవీంద్రారెడ్డి, తహశీల్దారు, వైపాలెం	గుంటూరు	గుంటూరు
బీ దిలీప్‌కుమార్‌, తహశీల్దారు, రాచర్ల	గుంటూరు	పల్నాడు

నైపుణ్యం వెలికితీసేందుకే ‘ఆడుదాం ఆంధ్రా’

- జిల్లాస్థాయి పోటీల ప్రారంభోత్సవంలో కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌



ప్రారంభ సభలో మాట్లాడుతున్న కలెక్టర్‌ దినేష్‌ కుమార్‌, వేదికపై మేయర్‌ గంగాడ సుజాత

ఒంగోలు: గ్రామస్థాయి నుంచి క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు అని కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌ అన్నారు. స్థానిక మినీ స్టేడియంలో బుధవారం జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ముందుగా జాతీయ పతాకాన్ని కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌ ఎగురవేయగా, రాష్ట్ర క్రీడా పతాకాన్ని నగర మేయర్‌ గంగాడ సుజాత, ఆడుదాం ఆంధ్రా జెండాను జెడ్పీ సీఈవో బి.జాలిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం జిల్లాలోని 8 నియోజకవర్గాల నుంచి వచ్చిన జట్ల క్రీడాకారుల వద్ద నుంచి కలెక్టర్‌ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడలకు బ్రాండ్‌ అంబాసిడర్లుగా నియమితులైన షేక్‌ ఇమామ్‌షా, జి.భక్తధృవుడు, మనోజ్‌సాయి క్రీడాజ్యోతి వెలిగించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి కలెక్టర్‌ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రావీణ్యం ఉన్నవారు ఉన్నప్పటికీ వారికి సరైన వేదిక లేకపోవడం, వారు జట్టుగా ఆడుకునేందుకు అందరూ కలిసి రాకపోవడం వంటి అంశాల వల్ల క్రీడానైపుణ్యాలు వెలికిరావడంలేదన్నారు. ఈ విషయాన్ని గమనించిన ముఖ్యమంత్రి క్రీడా నైపుణ్యాలను గ్రామస్థాయి నుంచి వెలికితీయాలనే ఒక మంచి ఉద్దేశంతో ఈ క్రీడలకు శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటికే సచివాలయ స్థాయి, మండల స్థాయి, నియోజకవర్గ స్థాయిల్లో విజేతలుగా నిలిచి వచ్చినందున మంచి జట్లు నేడు జిల్లా స్థాయిలో తలపడుతున్నాయన్నారు. జిల్లా స్థాయిలో కూడా మంచి సామర్థ్యాలను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఏ క్రీడ చూసినా ప్రకాశం జిల్లా క్రీడాకారులు సత్తాచాటని ఆట లేదన్నారు. అందువల్ల రాష్ట్రస్థాయిలో కూడా తప్పక పతకాలు సాధిస్తారన్న నమ్మకం ఉందంటూ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. క్రీడాకారులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు నియోజకవర్గాల వారీగా నోడల్‌ అధికారులను ఏర్పాటుచేసి అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నగర మేయర్‌ గంగాడ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడల్లో కూడా ప్రతిభను ప్రదర్శిస్తూ మంచి క్రీడాకారులుగా ఎదగాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని చక్కగా వినియోగించుకుంటున్నారంటూ ధన్యవాదాలు తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, నగదు పురస్కారాలు అందిస్తారన్నారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌, నగర మేయర్‌ గంగాడ సుజాత, జెడ్పీ సీఈవో బి.జాలిరెడ్డిలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ తరఫున సత్కరించారు. అనంతరం కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌కుమార్‌ కొద్దిసేపు వాలీబాల్‌ ఆడి ఆటల పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధిశాఖ అధికారి రాజరాజేశ్వరి, స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ జిల్లా కార్యదర్శి కె.వనజ, వివిధ శాఖల అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, నియోజకవర్గాల కోఆర్డినేటర్లు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



వాలీబాల్‌ సర్వీస్‌ చేసి ఆటల పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్‌ దినేష్‌కుమార్‌, మేయర్‌ గంగాడ



వాలీబాల్‌ మ్యాచ్‌లో తలపడుతున్న గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గ బాలుర జట్లు



కబడ్డీ మ్యాచ్‌లో తలపడుతున్న యర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గ బాలికల జట్లు

క్లుప్తంగా

29 వరకు పోలీసు యాక్ట్

ఒంగోలు టౌన్: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల నుంచి ఫిబ్రవరి 29వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు, సమావేశాలు, సభలు నిర్వహించకుండా రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, యూనియన్లు సహకరించాలని కోరారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూగర్భ జలాల పెంపుపై అవగాహన



మాట్లాడుతున్న జేడీ కేఎస్ శాస్త్రి

పెద్దారవీడు: భూగర్భ జలాల పెంపు, సాగు నీటి వినియోగంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని భూగర్భ జలశాఖ జాయింట్ డైరెక్టర్ కేఎస్ శాస్త్రి అన్నారు. స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో పంట- నీరు ప్రణాళికపై బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకం శాఖల సంయుక్తంగా భూజలాల యాజమాన్యంపై చిన్న, సన్న కారు రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. జలచక్రంలో భాగంగా ఏ పంటకు ఎంత మేరకు నీరు అవసరమో, ఎంత నీటిని వినియోగించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుగ్గెం చెన్నమ్మ, డీడీఏ ఉద్యానశాఖ ఏఈ రాజవర్ధన్‌రెడ్డి, ఏపీడీ బి.రోశమ్మ, ఉద్యాన శాఖాధికారి ఆదిరెడ్డి, ఏఓ బుజ్జి బాయి, రైతులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ డి.జయ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 23వ తేదీలోగా హెచ్‌టీటీపీఎస్:// ఏపీబీఆర్ఏజీసీఈటీ.ఏపీఎఫ్ఎస్ఎస్.ఇన్ అనే వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తులు సమర్పించాలన్నారు. ప్రవేశ పరీక్ష మార్చి 10వ తేదీ 5వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోరే విద్యార్థులకు అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల లేదా కళాశాల ప్రధానాచార్యులను సంప్రదించాలని కోరారు.

న్యాయవాదిపై క్రిమినల్ కేసు నమోదు

కనిగిరి రూరల్: నకిలీ షూరిటీలను పెట్టిన న్యాయవాదిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..హనుమంతునిపాడు పోలీస్ స్టేషన్లకు సంబంధించిన కేసులో గతంలో ఒంగోలు ఒకటో అదనపు జిల్లా జడ్జి బెయిల్ మంజూరు చేశారు. షూరిటీదారులుగా గుంటూరు జిల్లాకు చెందిన షేక్ జానీ, వేముల శ్రీనివాసులు, కోటేశ్వరమ్మ, కమలమ్మలను ఒంగోలుకు చెందిన న్యాయవాది కృష్ణారావు తన గుమస్తా ద్వారా కనిగిరి కోర్టులో హాజరుపరిచారు. అయితే కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్ర షూరిటీదారులను పరిశీలిస్తుండగా.. నకిలీపత్రాలు ఇచ్చినట్లు జడ్జి గమనించి జానీ అనే షూరిటీదారున్ని ప్రశ్నించారు. ఆ పత్రాలు తనవి కావని, లాయర్ చెప్పగా వేలిముద్రలు వేశానని, అవి నకిలీవని ఒప్పుకున్నాడు. ఇది గమనించిన మిగిలిన షూరిటీదారులు అక్కడ నుంచి పరారయ్యారు. దీంతో షూరిటీదారులపై కోర్టు సూపరింటెండెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏ1 నిందితునిగా లాయర్ కృష్ణారావుతో పాటు, మరో నల్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వైఎస్సార్ ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి

మహిళా పక్షపాతి సీఎం జగనన్న

- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి
- మహిళలకు రూ.6.06 కోట్ల చెక్కుల పంపిణీ
- చంద్రబాబు పాలన అంతా అవినీతి మయం

తాళ్లూరు(ముండ్లమూరు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం మహిళలకు వైఎస్సార్ ఆసరా సంబరాల్లో భాగంగా నాలుగో విడత రుణమాఫీ రూ.6.06 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. తాళ్లూరు మండలం అంటేనే జగనన్న అడ్డా అని, జగనన్న అడ్డ అంటే శివన్న అడ్డ అని తెలిపారు. పాదయాత్రలో మహిళల కష్టాలు నేరుగా తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి నేరుగా వారి ఖాతాకే నగదు జమ చేస్తున్నారన్నారు. విద్యా, వైద్యం కోసం అధిక ప్రాధాన్యమిచ్చి పేదల అభ్యున్నతికి జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని తెలిపారు. మహిళలకు అన్ని రంగాల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్న జగనన్నకు మనం రుణపడి ఉండాలన్నారు. ఇంటి స్థలం మంజూరుతో పాటు నిర్మాణం పూర్తయ్యే వరకు బాధ్యత తీసుకున్న ఏకైక సీఎం జగనన్న అని తెలిపారు. అలాంటి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 20 ఏళ్లుగా దర్శి నియోజకవర్గాన్ని అంటిపెట్టుకొని ప్రజా సేవ చేస్తున్న బూచేపల్లి జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.50 లక్షలు మహిళా భవన నిర్మాణానికి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.



ఆసరా సంబరాలకు హాజరైన మహిళలు

చంద్రబాబు జీవితం మొత్తం అవినీతిమయమే..

చంద్రబాబు రాజకీయ జీవితం మొత్తం అవినీతిమయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి జగనన్న ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడితే అడ్డుకున్న దుర్మార్గుడు చంద్రబాబు అన్నారు. పేదల కోసం సీఎం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను తప్పుబడుతున్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు వాటిని తొలగిస్తామని చెప్పే దమ్ము, ధైర్యం లేదన్నారు. అమరావతిని కరువు తాండవం చేస్తుందన్నారు. బంగారు గొలుసులు, బిస్కెట్లు, ఉచిత సిలిండర్ల పేరుతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న మాయగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. గత పాలనలో జన్మభూమి కమిటీలు నీరు - చెట్టు పథకం పేరుతో ప్రజాధనాన్ని నిలువునా దోచేశారన్నారు. ముందుగా వైఎస్సార్, బూచేపల్లి సుబ్బారెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళలకు రూ.6.06 కోట్ల చెక్కులు అందజేశారు. అనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో శివప్రసాదరెడ్డి సతీమణి నందిని, కాపా రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తూము వెంకటసుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీలు యిడమకంటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ చార్లెస్‌సర్జన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఐవీ సుబ్బారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి, పులి ప్రసాదరెడ్డి, ఎంపీటీసీ 2 యామర్తి ప్రభుదాసు, కొర్రపాటి విష్ణు, బ్రహ్మారెడ్డి, ఓబులరెడ్డి, చిమటా సుబ్బారావు, సొసైటీ అధ్యక్షులు కుమ్మిత జయరామిరెడ్డి, ఎంపీడీఓ యుగకీర్తి, ఎంఈఓ సుబ్బయ్య, సర్పంచులు, ఇతర నేతలు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి, మహిళలు

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- మ్యాన్‌పవర్, శిక్షణలు, ట్రాన్స్‌పోర్ట్ వంటి వాటిలో ముందస్తు చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియలకు సంబంధించి నియమితులైన నోడల్ అధికారులు కేటాయించిన విధులపై పూర్తి అవగాహన పెంచుకుని అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని, అందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో రానున్న ఎన్నికల ప్రక్రియకు సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, శిక్షణలు, మెటీరియల్, ట్రాన్స్‌పోర్ట్, స్వీప్ యాక్టివిటీస్, ఈవీఎం మేనేజ్‌మెంట్‌లతో పాటు ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్, ఎంసీఎంసీ, ఎలక్టోరల్స్ తదితర అంశాల్లో ముందస్తు విధులకు సంబంధించి నోడల్ అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బందికి తగిన శిక్షణ అవసరమని, అందుకు అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదుతో పాటు ఓటుహక్కు వినియోగించుకునే అవగాహన కల్పించాలన్నారు. అందుకు ముమ్మరంగా స్వీప్ యాక్టివిటీస్‌ను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి 10వ తేదీ నాటికి జిల్లాలోని అన్నీ పోలింగ్ కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించి చేపట్టాల్సిన ప్రాథమిక చర్యలపై పూర్తి స్థాయిలో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నోడల్ అధికారులకు కేటాయించిన విధులకు సంబంధించి చేపట్టిన చర్యలపై ప్లాన్‌ఆఫ్ యాక్షన్‌ను రూపొందించి అందజేయాలన్నారు. దీనిలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

జైలు జీవితం మంచిమార్పునకు నాంది

- జైలు సూపరింటెండెంట్ వరుణారెడ్డి

ఒంగోలు టౌన్: జైలు జీవితం ఖైదీల జీవితాల్లో మంచి మార్పునకు నాంది పలకాలని జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి అన్నారు. ఖైదీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం సోషల్ ఇంకుబేషన్ సెంటర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో నిబిడీకృతమై ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు తగిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా జైలులోని ఖైదీలకు వయోజన విద్య, నైపుణ్య శిక్షణకు అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ఖైదీలకు సమాజంలో మంచి వ్యక్తులుగా, గౌరవనీయంగా జీవించేందుకు అవకాశం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమిటీ సభ్యులు జైలు వైద్యాధికారి డాక్టర్ బ్రహ్మతేజ, జైలర్ వి.రమేష్, వెల్ఫేర్ సభ్యులు నీలిమ వంశీలత, సైకాలజిస్టు ఏడుకొండలు, మానసిక వైద్యులు చంద్రశేఖర్, సోషల్ కౌన్సిలర్ అనిల్‌కుమార్ సోషల్ ఇంకుబేషన్ సెంటర్ గురించి ఖైదీలకు అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న జైలు సూపరెండెంట్ వరుణారెడ్డి

బీసీ భవన్‌కు రూ.50 లక్షలు మంజూరు

- ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధుల కేటాయింపు
- బాలినేని చేతుల మీదుగా అందుకున్న బీసీ నేతలు



లక్షల నిధుల ధ్రువీకరణ పత్రాన్ని బీసీ సంఘాల నాయకులకు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: ఒంగోలులో అసంపూర్తిగా ఉన్న బీసీ భవన్ నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఒంగోలు ఎంపీ కార్యాలయ ప్రతినిధి ఓగిరాల రామకృష్ణ బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి అందించారు. అనంతరం బీసీ నేతలను ఆహ్వానించి వారికి ఆ ఉత్తర్వుల పత్రాలను బాలినేని శ్రీనివాసరెడ్డి అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, నగర కన్వీనర్ కటారి శంకర్‌లు మాట్లాడుతూ బీసీ భవన్‌కు స్థలం కేటాయించాలని కోరిన వెంటనే స్థలాన్ని కేటాయించిన గొప్ప మనసు బాలినేనిదన్నారు. బీసీలు ఆరామ క్షేత్రాలు లేకుండా నగరంలో అంత్యక్రియల సమయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళితే బీసీ కులాలు అందరితో మాట్లాడి రంగారాయుడు చెరువు పక్కన ఉన్న స్థలాన్ని బీసీ కులాలకు ఆరామ క్షేత్రాలు నిర్మించుకునేందుకు కేటాయించడంతో పాటు రూ.45 లక్షలు సొంత నిధులు కూడా అందజేసి పెద్ద మనస్సు చాటుకున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే బీసీ భవన్ నిర్మాణం అసంపూర్తిగా ఉండడానికి గల కారణాన్ని తెలుసుకుని ఆయన స్వయంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారన్నారు. దీంతో ఆయన ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించారన్నారు. సంబంధిత ఉత్తర్వుల కాపీని మాగుంట కార్యాలయ ప్రతినిధి సమక్షంలో బాలినేని ద్వారా అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. బీసీల పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనస్సు చూపుతున్నారని కొనియాడారు. బాలినేని సిఫార్సు చేయగానే ఎంపీ మాగుంట రూ.50 లక్షలు కేటాయించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి సుతారం శ్రీనివాసులు, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, మేదర సంఘం జిల్లా అధ్యక్షుడు చలపతిరావు, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దులూరి శ్రీనివాసరావు, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి కరుణాకర్, కృష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ తిర్లిక శ్రీనివాసులు, జంగమ సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు, వివిధ బీసీ సంఘాల నేతలు పాల్గొని బాలినేనికి, ఎంపీ మాగుంటకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో పలువురు సీఐల బదిలీ

ఒంగోలు టౌన్: జిల్లాలో పలువురు సీఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఐజీ పాల్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. కంభం సీఐ ఎం.రాజేష్‌కుమార్‌ను సత్తెనపల్లి రూరల్‌కు బదిలీ చేసి ఆయన స్థానంలో గుంటూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న జె.రామకోటయ్యకు పోస్టింగ్ ఇచ్చారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎస్. సుబ్బారావును త్రిపురాంతకం సర్కిల్‌కు, వీఆర్‌లో ఉన్న దాసరి ప్రసాద్‌ను గిద్దలూరు సర్కిల్‌కు బదిలీ చేశారు. వీఆర్ నుంచి మరో సీఐ కె.వెంకటేశ్వరరావును పీసీఆర్ ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు.

6 నెలల పాప కిడ్నాప్ యత్నం

దొనకొండ: మండలంలోని పోలేపల్లి ఎస్సీ కాలనీలో బుధవారం ఆరు నెలల పాప కిడ్నాప్ యత్నించారు. గ్రామస్తుల సమాచారం... ఎస్సీ కాలనీకి చెందిన యద్దనపూడి చిన్న కొండయ్య, సోనియా దంపతులకు ముగ్గురు కుమార్తెలు. మూడో కుమార్తె 6 నెలల పాపను వరండాలో ఉయ్యాలలో పడుకోబెట్టి తల్లి సోనియా మరో ఇద్దరు బాలికలతో ఆరు బయట కూర్చున్నారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఉయ్యాలలో పాపను ఎత్తుకుని పరారయ్యేందుకు ప్రయత్నిస్తుండగా పాప ఏడ్చింది. గుర్తు తెలియని వ్యక్తి పాపను ఎత్తుకుని వెళ్తుండటం చూసి తల్లి కేకలు పెట్టడంతో దుండగుడు పాపను వదిలి పరారయ్యాడు. వెంటనే తల్లి పాపను తీసుకుంది.

లక్ష్మీనృసింహస్వామి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

- రూ. 8.5 కోట్లతో రహదారి నిర్మాణం
- ఈ నెల 2న మంత్రి ఆదిమూలపు చేతుల మీదుగా శంకుస్థాపన

మద్దిపూడి: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన దేవాలయాల్లో ఒకటైన పృధులగిరి లక్ష్మీ నృసింహస్వామి ఆలయానికి వెళ్లే రహదారి నిర్మాణానికి రూ.8.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా ఈ నెల 2న శంకుస్థాపన చేయనున్నట్లు ఎంపీపీ సంఘ జిల్లా అధ్యక్షుడు, మద్దిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. చోళుల కాలంలో నిర్మించిన పృధులగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి రహదారి లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని మంత్రి ఆదిమూలపు సురేష్ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. అడిగినదే తరువుగా బీటీరోడ్ నిర్మాణానికి మద్దిపూడి నుంచి వయా లక్ష్మీనృసింహస్వామి కొండ జాప్లాపురం వరకు దాదాపు 10.5 కిలోమీటర్లకు రూ.8.5 కోట్లు ఆర్ఐడీఎఫ్ నిధులు మంజూరు చేశారన్నారు. నిధులు మంజూరు చేసినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. భక్తులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న లక్ష్మీనృసింహస్వామి రహదారి కల నెరవేరిందన్నారు. కార్యక్రమంలో మద్దిపూడి సొసైటీ అధ్యక్షుడు బోగసముద్రం విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ కదిరి భాస్కర్, మాజీ సర్పంచ్ ఇనుకొల్లు పిచ్చిరెడ్డి, మాచేపల్లి నాగయ్య, ఇనుకొల్లు మాదిరెడ్డి, రావులపల్లి నరసింహారావులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి

ఆగిన గుండెకు అందని సాయం

- చంద్రబాబు అరెస్ట్ వార్తలు విని అభిమానులు మృతి అంటూ ఎల్లో మీడియాలో కథనాలు
- కేవలం ఇద్దరికే ఆర్థిక సాయం అందించిన భువనేశ్వరి
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మిగిలిన బాధితులు

టంగుటూరు: స్కిల్ కుంభకోణం కేసులో చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్ట్ చేసిన సందర్భంలో ఆ వార్త విని అభిమానులు మృతి చెందారంటూ ఎల్లోమీడియాలో కొన్ని రోజులపాటు వార్తలు వెల్లువెత్తాయి. మృతుల కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సాయం అందించేందుకు 'నిజం గెలవాలి' పేరిట నారా భువనేశ్వరి చేపట్టిన కార్యక్రమం కొండపి నియోజకవర్గంలో గందరగోళానికి దారి తీసింది. చంద్రబాబు అరెస్ట్‌ను తట్టుకోలేక నియోజకవర్గంలో ఐదుగురు ప్రాణాలు విడిచారంటూ ఎల్లో మీడియా కథనాలు ప్రచురించింది. స్థానిక టీడీపీ నేతలు చెబుతున్న దాని ప్రకారం జరుగుమల్లి మండలం చిరుకూరపాడు గ్రామానికి చెందిన నలదల సుబ్బారావు, కొండపి మండలం కె.ఉప్పలపాడు గ్రామానికి చెందిన జంగాల అంజయ్య, టంగుటూరు మండలం మర్లపాడు గ్రామానికి చెందిన ముత్తినేని సుధాకర్, వెలగపూడి గ్రామానికి చెందిన కాకి రమణయ్య, టంగుటూరు గ్రామానికి చెందిన దుగ్గినేని అరుణ్‌కుమార్ మరణించారు. ఇదే విషయాన్ని పచ్చ పత్రికలు ప్రచురించాయి. బాధితులను పరామర్శించేందుకు చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి బుధవారం కొండపి నియోజకవర్గానికి వచ్చారు. కొండపి మండలం కె.ఉప్పలపాడు గ్రామానికి చెందిన జంగాల అంజయ్య, టంగుటూరు గ్రామానికి చెందిన దుగ్గినేని అరుణ్‌కుమార్ కుటుంబాలను మాత్రమే భువనేశ్వరి పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందించి చేతులు దులుపుకున్నారు. ఇది నియోజకవర్గంలో వివాదాస్పదంగా మారింది. నియోజకవర్గంలో మిగిలిన బాధితుల పరిస్థితి ఏమిటంటూ టీడీపీ నేతలే ప్రశ్నిస్తున్నారు. టంగుటూరు మండలం వెలగపూడిలో నిరుపేద దళిత కుటుంబానికి చెందిన కాకి రమణయ్య అనే అభిమాని మృతి చెందాడు. ఆయనకు ముగ్గురు ఆడపిల్లలు. ముందురోజు ఎంతో హుషారుగా చంద్రబాబుకు సంఘీభావంగా చేపట్టిన కొవ్వొత్తుల ర్యాలీలో కూడా పాల్గొన్నాడు. అటువంటి నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందలేదు. దళిత కుటుంబాన్ని టీడీపీ పూర్తిగా విస్మరించిందని పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చంద్రబాబు అరెస్ట్‌ను తట్టుకోలేక ఐదుగురు చనిపోతే రెండు కుటుంబాలకు మాత్రమే ఆర్థిక సాయం అందించడం సరికాదంటున్నారు. సానుభూతి కోసమే అభిమానుల్ని వాడుకుంటారా అని నిలదీస్తున్నారు.



టంగుటూరు: మృతుల వివరాలతో పచ్చపత్రికలో ప్రచురణ అయిన కథనం

టీడీపీ హయాంలో దళితులకు అన్యాయం



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపత్రి చంద్రశేఖర్

- దళితుడిగా పుట్టాలని ఎవరనుకుంటారన్న పెద్దమనిషి చంద్రబాబు
- జగనన్నది ప్రేమతత్వాన్ని పెంచే గుణం
- నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: టీడీపీ హయాంలో దళితులను ఓటుబ్యాంకుగా వాడుకున్నారని, దళితుడిగా ఎవరైనా పుట్టాలనుకుంటారా అని చంద్రబాబు అవమానాలకు గురిచేశాడని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో నియోజకవర్గ పాస్టర్ల సంఘ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రేమతత్వాన్ని పెంచే గుణం ఉన్న వ్యక్తని, రాష్ట్రంలో ఉన్న పాస్టర్ల కష్టాలను గుర్తించి సాహసోపేతంగా వారికి గౌరవ వేతనం అందిస్తున్నారని, దళితులను అన్ని విధాలా ఆదుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలోని పాస్టర్లతో పాటు క్రైస్తవుల సమస్యలను పరిష్కరిస్తానని, పాస్టర్లకు ఇళ్ల స్థలాలు ఇప్పించడమే కాకుండా గృహనిర్మాణాలకు తన వంతు సహాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. దళిత కాలనీల్లో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ లాంటి అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. సమస్యలను ఎన్నికల లోపే పరిష్కరించి ఓటు వేయమని అడిగేందుకు వస్తానని తెలిపారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్, వాగ్యానాయక్, జాన్‌పాల్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, జి.రమణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ చల్లా ఎల్లారెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, వైఎస్సార్ సీపీ క్రిష్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు చేదూరి కన్న, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, సొసైటీ అధ్యక్షుడు మేడగం వెంకటరెడ్డి, ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వర్‌రెడ్డి, నేతలు పాల్గొన్నారు.